కంది పోతోంది..!

- ఓ వైపు పురుగు, మరో వైపు పొగమంచు దెబ్బ
- పూత, కాయ రాలి దెబ్బతిన్న పంట
- తగ్గనున్న దిగుబడి

బత్తలపల్లి: కొన్నేళ్లుగా వేరుశనగ నష్టాలు మిగుల్చుతున్న కారణంగా చాలా మంది రైతులు ఈ ఏడాది కంది పంట సాగు చేశారు. అయితే ఈ ఏడాది కంది రైతులకూ నిరాశే మిగులుతోంది. ధర్మవరం నియోజకవర్గంలో రైతులు ఈ ఏడాది అత్యధికంగా 24,248 ఎకరాల్లో కంది పంట సాగు చేశారు. పంట ఏపుగా పెరిగి కాపు పట్టడంతో అధిక దిగుబడి వస్తుందని రైతులు సంబరపడ్డారు. అయితే గూడు, పచ్చ పురుగులు ఆశించడంతో ఆశలు ఆవిరయ్యాయి. కంది పంటను పురుగు తినేస్తోంది. పంట పూత, కాయ ఆశాజనకంగా ఉన్నా పురుగు కాయను తినేస్తుండడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్‌లో ఈ ఏడాది కందులకు మంచి డిమాండ్ ఉంది. పంట పూత దశలో శనగపచ్చ పురుగు, నల్లి పురుగు, దోమ పోటు సోకింది. దీంతో పూత రాలిపోతోంది. ఎన్ని మందులు పిచికారీ చేసినా పురుగు నాశనం కావడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. వర్షాలకు కంది కాయలు నల్లగా మారాయి. గింజలు పడిన కాయలు బూజు పట్టి పనికి రాకుండా పోతున్నాయి.


బత్తలపల్లి వద్ద సాగు చేసిన కంది పంట

పెట్టుబడులు కూడా అందేలా లేవు..

కంది పంటను సాగు చేసిన రైతులకు పెట్టుబడులు కూడా అందేలా లేదని రైతులు వాపోతున్నారు. కంది సాగుకు ఎకరాకు రూ.18 వేల నుంచి రూ.20 వేలకు పైగా ఖర్చవుతోంది. ఈ ఏడాది తుపాను, తెగుళ్ల కారణంగా ఎకరాకు అదనంగా రూ.10 వేలు ఖర్చు అవుతోందన్నారు. ఎకరాకు ఏడు క్వింటాళ్లకు పైగా దిగుబడి వస్తేనే గిట్టుబాటు అవుతుందటున్నారు. అయితే పంట పూత, కాయ రాలిపోతే పెట్టుబడి వచ్చేలా లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ధర్మవరం నియోజకవర్గంలో కంది పంట సాగు వివరాలు (ఎకరాల్లో)...	
మండలం	సాగు విస్తీర్ణం
ధర్మవరం	3,228
బత్తలపల్లి	5,940
తాడిమర్రి	3,587
ముదిగుబ్బ	11,493

మందులు వాడినా తగ్గని పురుగుల ఉధృతి..

కంది పంటను కాపాడుకునేందుకు రైతులు తీవ్రంగా శ్రమిస్తున్నారు. పంటను కాపాడుకునేందుకు పురుగు మందులను పిచికారీ చేసినా పురుగు తగ్గలేదు. మరోవైపు పొగ మంచుతో పూత రాలిపోతోంది. దీంతో ఎంచేయాలో తోచడంలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయాధికారులు పంటను పరిశీలించి, సూచనలు, సలహాలు ఇవ్వాలని వారు కోరుతున్నారు.

ట్రాక్టర్‌తో పంటపై పిచికారీ చేస్తున్నాం



నేను 30 ఎకరాల్లో కంది పంట సాగు చేశాను. పురుగు నివారణకు మందు పిచికారీ చేస్తున్నా పురుగు ఉధృతి తగ్గడంలేదు. దీంతో పెట్టుబడులు పెరుగుతున్నాయి తప్పా సమస్య పరిష్కారం కావడంలేదు. దిగుబడి కూడా తగ్గే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికే ఆరు దఫాలుగా మందులు పిచికారీ చేశాం.

–కలుగూరి కుళ్లాయప్ప, రైతు, లింగారెడ్డిపల్లి, బత్తలపల్లి మండలం

రైతులకు సలహాలు ఇవ్వాలి



నాకున్న 8 ఎకరాల్లో కంది పంటను సాగు చేశా. పురుగు వల్ల చెట్టుకు ఉన్న పూత రాలి నేలపాలవుతుంది. దీంతో దిగుబడి తగ్గుతుంది. పురుగు నివారణకు ఎన్ని మందులు పిచికారీ చేసినా ప్రయోజనం ఉండటం లేదు. కంది పంటకు పెట్టుబడులు పెరిగాయి కానీ, పురుగు దెబ్బతో దిగుబడి తగ్గుతుంది. గతంలో ఎన్నడూ లేనివిధంగా పురుగు ఉధృతికి పూత, కాయ రాలిపోతుంది. ఇప్పటికి ఏడు దఫాలు మందు పిచికారీ చేశా.

–బిల్లే పెదయ్య, రైతు, బత్తలపల్లి

జాగ్రత్తలు తీసుకోవాలి



కంది పంటను కాపాడుకునేందుకు రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలి. కందిలో పురుగు, పచ్చ పురుగు(మారకామచ్చల పురుగు) నివారణకు లీటరు నీటికి 0.3 మి.లీల క్లోరాన్ట్రానిలిప్రోల్ మందును పిచికారీ చేస్తే పురుగు కంది పంటను ఆశించదు. ఇష్టానుసారంగా పిచికారీ చేస్తే డబ్బు వృథా అవుతాయి. పురుగు చనిపోదు.

–ఓబిరెడ్డి, ఏఓ, బత్తలపల్లి

క్లుప్తంగా

నైతిక విలువలు పెంపొందించుకోండి


మాట్లాడుతున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రెడ్డి

ధర్మవరం అర్బన్: ప్రతి విద్యార్థి నైతిక విలువల పెంపొందించుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని కేహెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం విజన్ స్వర్ణాంధ్రప్రదేశ్ 2047 అనే అంశంపై విద్యార్థులకు ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ దేశ అభివృద్ధిలో విద్యార్థుల పాత్ర ఎంతో ముఖ్యమన్నారు. నైతిక విలువలో సమాజం అభివృద్ధి మార్గంలో పయనిస్తుందన్నారు. ఉరవకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు నారాయణస్వామి, ధర్మవరం కళాశాల అధ్యాపకులు వెంకటరాముడు, గోపాల్‌నాయక్, చిట్టెమ్మ, కిరణ్‌కుమార్, త్రివేని, షమీవుల్లా, పావని, భువనేశ్వరి, పుష్పావతి, మీనా, ఆనంద్ పాల్గొన్నారు.

మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి


విద్యార్థినులకు పేపర్లు అందిస్తున్న పాఠశాల హెచ్‌ఎం మేరివరకుమారి

ధర్మవరం అర్బన్: పట్టణంలోని కొత్తపేట మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న 87 మంది విద్యార్థినులకు దాత మంచాల చంద్రశేఖర్ సౌజన్యంతో యూటీఎఫ్ పట్టణ శాఖ మహిళా విభాగం ఆధ్వర్యంలో మోడల్ పేపర్లను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్, పాఠశాల హెచ్‌ఎం మేరి వరకుమారి మాట్లాడుతూ విద్యార్థులు యూటీఎఫ్ రూపొందించిన మోడల్ పేపర్స్‌ను బాగా చదివి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలన్నారు. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి లతాదేవి, మహిళా విభాగం నేతలు నాగేంద్రమ్మ, ఉపాధ్యాయులు శారద, కరుణ, నీరజ, పూజారి రమేష్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సంకష్టహర చతుర్థి


పూజలందుకున్న వినాయకుడు

కదిరి టౌన్: పట్టణంలోని శివాలయంలో బుధవారం భక్తిశ్రద్ధలతో సంకష్టహర చతుర్థి నిర్వహించారు. ఆలయంలో ఉన్న వినాయకుడికి ప్రత్యేక అలంకరణ చేసి పూజలు చేశారు. మహిళలు ఉపవాస దీక్షలతో గణపతిని పూజించారు. సకల విఘ్నాలకు అధిపతి ఆదిదంపతుల కుమారుడైన వినాయకుడిని పూజిస్తే గ్రహదోషాలు, సంకటాలు తొలగిపోతాయని అర్చకులు తెలిపారు.

ఘనంగా జాతీయ మైనార్టీ హక్కుల దినోత్సవం

ధర్మవరం అర్బన్: పట్టణంలోని ఎంఎండీఏ కార్యాలయంలో బుధవారం జాతీయ మైనార్టీ హక్కుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షుడు రోషన్ జమీర్ మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులను గౌరవిస్తూ మైనార్టీ ప్రజల హక్కులను పరిరక్షించడం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కర్తవ్యమన్నారు. కార్యక్రమంలో ఎంఎండీఏ నియోజకవర్గ అధ్యక్షుడు దాదా పీర్, సభ్యులు పాల్గొన్నారు.

కుడి కాలువకు నీటి సరఫరా పెంపు


కుడికాలువలో ప్రవహిస్తున్న పీఏబీఆర్ నీరు

కూడేరు: పెన్నహోబిళం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్(పీఏబీఆర్) నుంచి బుధవారం 650 క్యూసెక్కులకు పెంచి కుడికాలువకు నీటిని సరఫరా చేసినట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు. కుడికాలువ ధర్మవరం నియోజక వర్గం తాడిమర్రి మండలం అగ్రహారం చెరువు వరకు 112 కిలో మీటర్లు దూరం ఉంది. అగ్రహారం చెరువులోకి పీఏబీఆర్ నీరు చేరుతోంది. అక్కడి నుంచి చెరువులు నింపుకుంటూ వస్తామని అధికారులు వెల్లడించారు.

ప్రజా సంక్షేమాన్ని గాలికి వదిలిన ప్రభుత్వం

తాడిమర్రి: కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని గాలికి వదిలిందని సీపీఐ ధర్మవరం డివిజన్ కార్యదర్శి మధు విమర్శించారు. మండల కేంద్రంలో కార్మిక సంఘం మండలాధ్యక్షుడు బీసాని లక్ష్మీనారాయణ అధ్యక్షతన బుధవారం జరిగిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. సూపర్ సిక్స్‌తో అధికారం దక్కించుకున్న కూటమి ప్రభుత్వం తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, ఉచిత బస్సు ప్రయాణం, ఆడబిడ్డ నిధి తదితర పథకాలు అమలు చేయడం లేదన్నారు. ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు గడుస్తున్నా గ్రామాల అభివృద్ధికి ఎలాంటి నిధులు కేటాయించక పోవడం దారుణమన్నారు. ప్రధానంగా రైతులకు ఎలాంటి సాయం అందలేదన్నారు. అనంతరం ఆయన పార్టీ సభ్యత్వ నమోదు చేపట్టారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కుళ్లాయప్ప, బత్తలపల్లి మండల కార్యదర్శి బండల వెంకటేష్, కార్యదర్శి దాసు, సన్నపెద్దన్న, నిడిగల్లు రాముడు, చౌడప్ప, రామకృష్ణ, చిన్న వెంకటరాముడు, నాగభూషణం, ఓసూరప్ప పాల్గొన్నారు.


తాడిమర్రిలో పార్టీ సభ్యత్వ నమోదు చేస్తున్న దృశ్యం

‘పల్లె పండుగ’ ఆచరణలో కనిపించడం లేదు

ముదిగుబ్బ: పల్లె పండుగ పేరుతో సిమెంట్ రోడ్లు నిర్మిస్తామని అధికారులు, నాయకులు ఆర్భాటంగా ప్రారంభోత్సవాలు చేశారే తప్ప ఆచరణలో కనిపించడం లేదని సీపీఐ నాయకులు విమర్శించారు. బుధవారం సీపీఐ నాయకులు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ దివాకర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ నేత చల్లా శ్రీనివాసులు మాట్లాడుతు ఉపాధి హామీ కింద ముదిగుబ్బ మండలంలో కూడా రూ.3 కోట్లతో రోడ్లు నిర్మించడానికి మంత్రి సత్యకుమార్‌తో పాటు అధికారులు ప్రారంభోత్సవాలు చేశారన్నారు. రెండు నెలలు గడుస్తున్నా ఎక్కడా కనీసం ఒక మీటర్ సిమెంట్ రోడ్డు కూడా నిర్మించకపోవడం శోచనీయమన్నారు. కూటమి నాయకులు ఆర్భాటాలే కాని ఆచరణలో చేతులెత్తేశారన్నారు. ఇకనైనా ఆర్భాటాలు మాని సీసీ రోడ్లు నిర్మించాలని వారు డిమాండ్ చేశారు.


ఎంపీడీఓకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

గొర్రెల కాపరి కుటుంబానికి పరామర్శ

ధర్మవరం రూరల్: బడన్నపల్లికి చెందిన గొర్రెల కాపరి దాసరి శివయ్యకు చెందిన 40 గొర్రెలు వందేభారత్ కింద పడి మృతి చెందిన విషయం విదితమే. విషయాన్ని తెలుసుకున్న బీసీ సంక్షేమ సంఘం నాయకులు బుధవారం గ్రామానికి వెళ్లి బాధితున్ని పరామర్శించారు. ఈ సందర్భంగా రూ.10వేలను బాధితునికి అందజేశారు. పరామర్శించిన వారిలో జిల్లా అధ్యక్షుడు సామకోటి ఆదినారాయణ, నామాల శంకర్, ధర్మవారం పట్టణ అధ్యక్షుడు బండి వెంకటేష్, నాయకులు మల్లన్న, తిరుపాల్, జంగమన్న, రవి, నాగేంద్ర, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఫెన్సింగ్ జట్టు ఎంపికకు దరఖాస్తు చేసుకోండి

ధర్మవరం రూరల్: ఈ నెల 21 నుంచి 23 వరకు విజయవాడలోని మున్సిపల్ స్టేడియంలో జరిగే రాష్ట్ర స్థాయి సీనియర్ ఫెన్సింగ్ పోటీలు జరగనున్నాయి. ఇందుకు సంబంధించి ఏపీ స్టేట్ టీమ్ కోసం ఎంపికకు ఉమ్మడి అనంతపురం జిల్లా క్రీడాకారులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ఫెన్సింగ్ అసోసియేషన్ కార్యదర్శి జీఎస్‌వీ కృష్ణమోహన్ ఓ ప్రకటనలో తెలిపారు. గురువారం అనంతపురంలోని డీఎస్ఏలో ఎంపికలు జరుగుతున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు 9676352682 నంబరులో సంప్రదించాలని సూచించారు.

గుండెపోటుతో వైఎస్సార్‌సీపీ నేత మృతి


రంగారెడ్డి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

రామగిరి: కుంటిమద్ది గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు రంగారెడ్డి (65) గుండెపోటుతో మంగళవారం రాత్రి మృతిచెందాడు. ఈయనకు భార్య, ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి బుధవారం కుంటిమద్దికి చేరుకుని మృతదేహానికి వాళులర్పించారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గోసే నాగార్జున, సర్పంచ్ నరేంద్ర, పార్టీ మండల మాజీ కన్వీనర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

ఎన్పీకుంట: రైతులు రబీ సీజన్‌లో సాగు చేసిన పంటలను రోజూ పరిశీలిస్తూ తెగుళ్ల సోకకుండా సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఉద్యానశాఖ అధికారి ఎస్.ప్రతాప్‌రెడ్డి, మండల వ్యవసాయ అధికారి లోకేశ్వరరెడ్డి సూచించారు. మండల పరిధిలోని ఎదురుదోన, మేకలచెరువు రైతు సేవా కేంద్రాల పరిధిలో బుధవారం వ్యవసాయ, అనుబంధ శాఖల ఆధ్వర్యంలో ‘పొలం పిలుస్తోంది’ కార్యక్రమాన్ని నిర్వహించారు. టమాట పంటలో పాటించాల్సిన యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. పంటలో సూక్ష్మపోషకాల లోపం ఉన్నట్లయితే లీటరు నీటిలో ఫార్ములా–4ను 5 గ్రాములు కలిపి పిచికారీ చేయాలన్నారు. వేస్ట్ డీకంపోజర్ వాడటం వలన పురుగు, తెగుళ్లతో పాటు నేలల ఆరోగ్యం కాపాడుకోవచ్చని సూచించారు. ఆకు మచ్చ రోగ నివారణకు ఒక లీటరు నీటికి మూడు గ్రాముల కాపర్ ఆక్సిక్లోరైడ్, ఆకు, కాయమచ్చ తెగుళ్ల నివారణకు లీటరు నీటిలో రెండు గ్రాముల సాఫ్ లేదా 1.5 గ్రాముల అమిస్టర్ గోల్డ్ కలిపి పిచికారీ చేయాలని పేర్కొన్నారు. తుపాన్ ప్రభావం వలన పంటలు దెబ్బతినకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఏవైనా తెగుళ్ల సోకినట్లయితే వ్యవసాయ సిబ్బందిని సంప్రదించి తగిన మోతాదులో ఎరువులు వాడాలని తెలిపారు. కొత్తగా పండ్ల తోటలు పెట్టే రైతులకు, ఫారం పాండు, ప్యాక్ హౌస్ కట్టుకునే రైతులకు ప్రభుత్వం రాయితీ ఇస్తుందని పేర్కొన్నారు. ఆసక్తి గల రైతులు సమీపంలోని రైతు సేవా కేంద్రంలో సంప్రదించాలన్నారు.


టమాట రైతులకు సూచనలు ఇస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

రైతులకు మెరుగైన సేవలందించండి

ధర్మవరం రూరల్: రైతులకు మెరుగైన సేవలందించాలని డీఏఓ వైవీ సుబ్బారావు రైతు సేవా కేంద్రాల సిబ్బందికి సూచించారు. బుధవారం స్థానిక ఎన్‌జీఓ కార్యాలయంలో ధర్మవరం డివిజన్‌లోని రైతు సేవా కేంద్ర సిబ్బందికి సామర్థ్యం పెంపుపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఆర్ఎస్‌కే సిబ్బంది తప్పనిసరిగా ఈ పంట నమోదు చేయాలన్నారు. రైతులకు అందుబాటులో ఉండి తగిన సలహాలివ్వాలన్నారు. పంటల్లో సమగ్ర ఎరువుల యాజమాన్యం, ప్రకృతి వ్యవసాయం, వివిధ పంటలలో చీడ పీడల నివారణ చర్యలు, సూక్ష్మనీటి పారుదల, మామిడిలో యాజమాన్య పద్ధతులు తదితర వాటిపై అవగాహన కల్పించారు. ఏపీఎంఐపీడీ సుదర్శన్, డీహెచ్ఓ చంద్రశేఖర్, ఏడీఏలు క్రిష్ణయ్య, సనావుల్లా, సిరికల్చర్ అధికారి దామోదర్‌రెడ్డి, ఏఓలు ముస్తఫా, ఓబిరెడ్డి, రమాదేవి, కృష్ణకుమారి, ఆత్మ బీటీయం ప్రతిభ, రైతు సేవా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీఏఓ వైవీ సుబ్బారావు

తాళం వేయకుండా వెళ్లిపోయారు..!


తలుపులు తెరిచి ఉన్న సచివాలయం

ఎన్పీకుంట: మండల కేంద్రంలోని ఎన్.పీ.కుంట–2 సచివాలయానికి సిబ్బంది తాళం వేయకుండానే వెళ్లిపోయిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. రూ.లక్షలు విలువ చేసే సామగ్రి, ఫర్నిచర్ కార్యాలయంలో ఉన్నప్పటికీ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించారు. గతంలో కూడా పలుమార్లు ఇలానే తాళం వేయకుండా సిబ్బంది వెళ్లారు.. అయినా వారిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోకపోవడంతో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు సచివాలయ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఏడుగురిపై కేసు నమోదు

కదిరి టౌన్: నకిలీ పత్రాలతో ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించే యత్నం చేసిన ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ నారాయణరెడ్డి తెలిపారు. మున్సిపల్ పరిధిలోని సర్వే నంబర్ 563–2లో ఉన్న ప్రభుత్వ స్థలానికి పలువురు నకిలీ పత్రాలు సృష్టించి అనుభవిస్తున్నారని ఇన్‌చార్జ్ మున్సిపల్ కమిషనర్ చంద్రమ్మ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పట్టణ సీఐ చర్యలు తీసుకున్నారు. కదిరికి చెందిన ఎస్.దాదాపీర్, ఉట్టి ఆదిమూర్తి, గూడూరు సౌభాగ్యవతి, మన్యం నాగరత్నమ్మ, అలాగే పత్రాల్లో సాక్షి సంతకాలు చేసిన అమరేష్, రామానాయుడు, పత్రాల తయారీలో సహకరించిన గూడూరు పాల హరిపై కేసు నమోదు చేశారు.

లక్ష్మీచెన్నకేశవునికి పూజలు

చెన్నేకొత్తపల్లి: ధనుర్మాసాన్ని పురస్కరించుకుని బుధవారం లక్ష్మీచెన్నకేశవ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువ జామునే మూల విరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

ప్రధాన రహదారుల్లో చెత్త తొలగింపు


నేసేపేటకు వెళ్లే రహదారిలో శుభ్రం చేసిన దృశ్యం

సాక్షి ఎఫెక్ట్..

ధర్మవరం అర్బన్: పట్టణంలోని ప్రధాన రహదారుల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని మున్సిపల్ సిబ్బంది తొలగించారు. సాక్షిలో మంగళవారం ‘గాడి తప్పిన పుర పాలన’ అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్ స్పందించారు. పట్టణంలోని ప్రధాన రహదారులపైన పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించారు. రోజూ ఉదయం, సాయంత్రం చెత్తాచెదారాన్ని తొలగిస్తున్నామని అయినా స్థానికులు, వ్యాపారులు చెత్తాచెదారాన్ని వేస్తున్నారని మున్సిపల్ కమిషనర్ తెలిపారు.

నిత్యావసరాలు సకాలంలో పంపిణీ చేయాలి

ఓడీచెరువు: సకాలంలో నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలని తహసీల్దార్ అనంతాచారి పేర్కొన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం చౌకధాన్యపు డిపో డీలర్లతో సమావేశాన్ని నిర్వహించారు. కార్డుదారుల నుంచి ఎలాంటి ఫిర్యాదులు రాకుండా డీలర్లు సరుకులు పంపిణీ చేయాలని తహసీల్దార్ సూచించారు.

గరిమెళ్ల సత్యనారాయణ వర్ధంతి

ధర్మవరం అర్బన్ : పట్టణంలో బుధవారం కవి గరిమెళ్ల సత్యనారాయణ 72వ వర్ధంతిని వైఎస్సార్ ఎస్టీసెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి దేవరకొండ రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా గరిమెళ్ల సత్యనారాయణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దేవరకొండ రమేష్ గరిమెళ్ల జీవిత చరిత్రను తెలియజేశారు.

అయ్యప్పస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు


అయ్యప్పస్వామికి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

తాడిమర్రి: స్థానిక అయ్యప్పస్వామి ఆలయంలో బుధవారం అయ్యప్పస్వామి మాలధారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గురుస్వామి సత్యనారాయణస్వామి మహాగణపతి, కుమార స్వామి చిత్ర పటాలకు పూలమాలలు వేసి అందంగా అలంకరించారు. అనంతరం అయ్యప్పస్వామి చిత్రపటానికి భస్మాభిషేకం, కుంకుమాభిషేకం, నెయ్యాభిషేకం చేశారు. స్వామి చిత్రపటానికి, అయ్యప్పస్వామి పడి (18 మెట్లకు)కు పూల మాలలు వేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మహేశ్వర్‌రెడ్డి, నాగేంద్రరెడ్డి, చంద్ర తదితర మాలధారులు పాల్గొన్నారు.

అందుబాటులో చీనీ మొక్కలు

ధర్మవరం రూరల్: చిగిచెర్ల ప్రభుత్వ నర్సరీలో రంగాపూర్ రకం చీని మొక్కలు అందుబాటులో ఉన్నాయని ఉద్యాన శాఖ అధికారిణి అమరేశ్వరి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఒక్కో మొక్క ఖరీదు రూ.60 రూపాయలని, కావాల్సిన రైతులు 7382386882 నంబరులో సంప్రదించాలని సూచించారు.

రెవెన్యూ సదస్సులు సద్వినియోగం చేసుకోండి


సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

చెన్నేకొత్తపల్లి: భూ సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సును రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పరిటాల సునీత సూచించారు. గంగినేపల్లి బుధవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఎమ్మెల్యే మాట్లాడారు. రైతుల ద్వారా తీసుకున్న అర్జీలను అధికారులు పరిశీలించి, పరిష్కారం చూపుతారని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ సురేష్‌కుమార్, ఎంపీడీఓ శివశంకరప్ప, ఈఓఆర్డీ అశోక్‌కుమార్‌నాయక్, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

బత్తలపల్లి: మండల వ్యాప్తంగా భూ సమస్యల్ని పరిష్కరించడానికే ప్రభుత్వం రెవెన్యూ సదస్సు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ స్వర్ణలత పేర్కొన్నారు. బుధవారం ఓబుళాపురంలో సర్పంచు బండి సరస్వతి అధ్యక్షతన రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ సమస్యలు ఏమైనా ఉంటే రైతులు రాతపూర్వకంగా అందజేయాలన్నారు. పలువురు రైతులు భూ సమస్యలపై వినతి పత్రాలను అందజేశారు. దేవదాయశాఖ అధికారిణి నాగరత్నమ్మ, జూనియర్ అసిస్టెంట్ హరికృష్ణ, వీఆర్వో టి.రాజశేఖర్, గ్రామ సర్వేయర్ వేదవతి పాల్గొన్నారు.

తాడిమర్రి: రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ భాస్కర్‌రెడ్డి రైతులకు సూచించారు. కునుకుంట్ల గ్రామ సచివాలయంలో బుధవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ భూముల రస్తా సమస్యలు, భూ సర్వే సమస్యలు, సరిహద్దు సమస్యలు, ఇళ్ల పట్టాలు, రేషన్‌కార్డులు తదితర సమస్యల పరిష్కారం కోసం రెవిన్యూ సదస్సులు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా వెబ్‌ల్యాండ్ నమోదు కోసం రెండు, భూమి రీసర్వే కోసం రెండు అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ తెలిపారు. ఎండోమెంట్ అధికారి అరుణ్‌కుమార్, మండల సర్వేయర్ సుశాంతి, వీఆర్ఓ ఓబిలేసు, జూనియర్ అసిస్టెంట్ దినేష్, రైతులు పాల్గొన్నారు.


ఓబుళాపురం రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దార్ స్వర్ణలత

ఓడీచెరువు: మండల పరిధిలోని అల్లాపల్లి సచివాలయంలో బుధవారం రెవెన్యూ రైతు సదస్సు నిర్వహించినట్లు తహసీల్దార్ అనంతాచారి తెలిపారు. వివిధ సమస్యలపై రైతుల నుంచి 55 ఫిర్యాదులు అందినట్లు పేర్కొన్నారు.

అమడగూరు: మండలంలోని కస్సముద్రంలో తహసీల్దార్ రామనాథరెడ్డి ఆధ్వర్యంలో బుధవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. గతంలో రీసర్వే జరగడంతో జాయింట్ ఎల్‌పీఎం ఉన్న 9 మంది రైతులు అర్జీలు అందజేసినట్లు అధికారులు తెలిపారు.

నల్లమాడ: నల్లమాడ రెవెన్యూ గ్రామానికి సంబంధించి గ్రామ సచివాలయంలో రెవెన్యూ సదస్సును బుధవారం నిర్వహించారు. తహసీల్దార్ రంగనాయకులు మాట్లాడుతూ పలు సమస్యలపై 44 అర్జీలు అందిన ట్లు పేర్కొన్నారు.